క్లుప్తంగా

దొరబాబుకు నేతల పరామర్శ



దొరబాబును పరామర్శిస్తున్న దళిత నేతలు

కోటనందూరు: మాతృవియోగంతో బాధపడుతున్న స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు గరిసింగు దొరబాబును ఆ పార్టీ నేతలు శనివారం పరామర్శించారు. హంసవరం, భీమవరపుకోట సర్పంచులు మేరీ అవినాష్, జిగటాల వీరబాబు, తుని నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు లంక కృపానందం, దళిత నాయకుడు గారా శ్రీను దొరబాబును ఆయన స్వగృహంలో పరామర్శించి సానుభూతి తెలిపారు. దొరబాబు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొత్తపల్లి మాణిక్యాలరావు, జిగటాల సత్తిబాబు, బండి నాని, కురందాసు రాము, కర్రి జగదీష్, దడాల గంగాదర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రారంభోత్సవం



వల్లూరు లక్ష్మీగణపతి ఆలయం వద్ద భక్తుల కోలాహలం

తుని రూరల్: మండలంలోని వల్లూరులో దాతల సహకారంతో నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయ ప్రారంభోత్సవం శనివారం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన కొత్తూరు ప్రకాశరావు కుమారుడు తేజో భాస్కరరావు దంపతులు ఆలయాన్ని నిర్మించారు. దాతలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు, శాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించి ఆలయ ప్రవేశం చేశారు. శ్రీలక్ష్మీ గణపతి విగ్రహాలను ధాన్యరాసులలో ఆవాహనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు భాగస్వాములు అయ్యారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

కనకదుర్గమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



రౌతులపూడి కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

రౌతులపూడి: స్థానిక సినిమా సెంటర్‌లో వెలసిన కనకదుర్గమ్మ 14వ బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాజులూరు మండలం దుగ్గుదుర్రుకు చెందిన పూజ్యం నాగేశ్వరరావుశర్మ ఆధ్వర్యంలో పండితులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని యూజే పురంలో విఘ్నేశ్వరుడి ఆలయంలో కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నడిగట్ల త్రిమూర్తులు, ఎంపీటీసీ మేడసాని సింహాద్రి, పార్టీ నాయకులు రామిశెట్టి బులిరామకృష్ణ, ఒట్టి కోళ్ల నూకరాజు, పప్పల చక్రం, తేటకాయల నూకరాజు, కర్ణం చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఇంపాక్ట్



పాత కోదాడలో తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

తొండంగి: మండలంలోని కోదాడ పంచాయతీ పాత కోదాడలో ప్రజల తాగునీటి కష్టాలపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో పంట కాలువ తవ్వకం కారణంగా పైపులైన్ దెబ్బతిని ఓ కాలనీ ప్రజలకు సుమారు పది రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీనిపై 'సాక్షి'లో వార్త ప్రచురితమవ్వడంతో అధికారులు శనివారం పైపులైన్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

పత్తి.. తగ్గిన ఆసక్తి

మెట్ట మండలాల్లో పత్తిసాగు వివరాలు (హెక్టార్లలో)		
మండలం	సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	ప్రస్తుత సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
తుని	395	288
తొండంగి	64	22
కోటనందూరు	09	02
రౌతులపూడి	338	225
శంఖవరం	134	15
ప్రత్తిపాడు	369	85
ఏలేశ్వరం	402	05
జగ్గంపేట	00	00
కిర్లంపూడి	45	20
గండేపల్లి	20	02



హెచ్.కొత్తూరులో సాగు చేస్తున్న పత్తి పంట

- తెల్లబంగారం సాగుపై మక్కువ చూపని రైతులు
- ఐదేళ్లలో భారీగా తగ్గిన పత్తిసాగు విస్తీర్ణం
- ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లిన అన్నదాతలు

తుని రూరల్: మెట్టప్రాంత రైతులు తెల్లబంగారంగా భావించే పత్తి సాగుపై ఆసక్తి చూపడం లేదు. మెట్టలో పత్తిసాగు విస్తీర్ణం ఏటా క్రమంగా తగ్గిపోతోంది. ఐదేళ్ల కిందట కాకినాడ జిల్లాలో 15 వేల హెక్టార్లలో సాగయ్యే పత్తిపంట ఘననీయంగా తగ్గిపోయి ఈ సంవత్సరం 1362 హెక్టార్లకు పడిపోయింది. వాతావరణ మార్పులు, అధికమైన పెట్టుబడులు, గిట్టుబాటు ధరల ప్రభావంతో పత్తిసాగు విస్తీర్ణం తగ్గినట్టు రైతులు, వ్యాపారులు, అధికారులు పేర్కొన్నారు. అధికారులు సైతం పంటమార్పిడి, ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించడం మరో కారణమయ్యింది. వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో గడిచిన ఐదేళ్ల అధిక వర్షాలు కువరడం, పుష్కర కాలువ ద్వారా సాగునీరు అందుబాటులోకి రావడంతో పత్తికి ప్రత్యామ్నాయంగా రైతులు వరిసాగు వైపు మొగ్గు చూపారు. దీంతో క్రమంగా పత్తిసాగు క్షీణించింది.

సబ్ డివిజన్‌లో తగ్గిన సాగు

అప్పులు చేసి పెట్టుబడి పెట్టడంతో పాటు ఆరుగాలం కష్టపడినా నష్టాలే మిగులుతుండడంతో పత్తి సాగుపై రైతులకు ఆసక్తి తగ్గింది. తుని మండలంలో ఎర్రరేగడి నల్లరేగడితో పాటు బంకమట్టి భూములు ఉన్న హంసవరం, హెచ్.కొత్తూరు, టి.తిమ్మాపురం, గవరపేట, ఎ.అగ్రహారం, ఎన్.చామవరం, ఎస్.అన్నవరం, వి.కొత్తూరు, చేపూరు, రౌతులపూడి మండలం శృంగధార, డీజే పురం, రౌతులపూడి, పైడిపాల, పి.చామవరం, మెరక చామవరం గ్రామాల్లో అత్యధికంగా పత్తిసాగు జరిగేది. కోటనందూరు, తొండంగి, శంఖవరం మండలాల్లోనూ రైతులు పత్తిసాగు చేసేవారు. ఇప్పుడు పరిస్థితి మారడంతో తుని మండలం టి.తిమ్మాపురం, హెచ్.కొత్తూరు, హంసవరం, ఎ.అగ్రహారం, చామవరం, ఎస్.అన్నవరం గ్రామాలకు పుష్కర కాలువద్వారా సాగునీరు అందుతోంది. ఎస్.అన్నవరంలో భూములు తుని పట్టణాన్ని ఆనుకుని ఉండడంతో లే అవుట్లు వేసి ఇళ్ల స్థలాలను విక్రయిస్తున్నారు. ఫలితంగా మండలంలో 2500 హెక్టార్లలో పత్తిసాగు తగ్గిపోయింది. మిగిలిన నాలుగు మండలాల్లోనూ వేర్వేరు కారణాలతో పత్తిసాగుపై రైతుల్లో ఆసక్తి సన్నగిల్లింది.

పత్తికి ప్రత్యామ్నాయంగా వరిసాగు

ఐదేళ్లుగా పుష్కర కాలువ నుంచి సాగునీరు అందుతోంది. పంట మార్పిడి, అందుబాటులో సాగునీరు ఉండడంతో పత్తికి ప్రత్యామ్నాయంగా వరిసాగు చేస్తున్నాను. ఈ సంవత్సరం వర్షాలు కురవలేదు. పుష్కర నీరు ఇప్పటికీ చేరలేదు. వర్షాలు కురిసి, పుష్కరనీను వస్తే వరిసాగు చేస్తాను.

– పి.నాగన్నదొర, రైతు, ఎ.అగ్రహారం

గిట్టుబాటు కావడం లేదు

అప్పు చేసి పెట్టుబడి పెట్టినా గిట్టుబాటు ధర లభించడం లేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలంచకపోవడంతో పత్తి దిగుబడులు తగ్గిపోతున్నాయి. ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. ప్రైవేట్ వ్యాపారులకు పత్తి విక్రయించాల్సి వస్తోంది. ప్రతి సంవత్సరం నష్టాలే మిగులుతున్నాయి.

– పి.అప్పలనాయుడు, పత్తి రైతు, వి.కొత్తూరు.

ఆరుతడి సాగుపై రైతులకు అవగాహన



ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పంపిణీ చేసిన భూమిలో నీటి పరిమాణం కొలిచే గొట్టాలతో రైతులు

గోకవరం: మండలంలో కామరాజుపేటలో రైతులకు శనివారం ఆరుతడి పద్ధతిపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంటీఎల్ బసవన్నగౌడ్, ఎస్ఎఫ్ఎంటీఎల్ దేవి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరుతడి విధానాన్ని అనుసంధానం చేయడం వలన అధిగ దిగుబడులు సాధించవచ్చన్నారు. తద్వారా మంచి లాభాలతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్నారు. పంటలపై క్షేత్ర స్థాయిలో బయోచార్, భూమిలో నీటి పరిమాణం కొలిచే విధానం, వివిధ రకాల కషాయాల తయారీ, డ్రోన్ వినియోగం తదితర అంశాలను వివరించారు. అనంతరం రైతులకు భూమిలో నీటి పరిమాణం కొలిచే గొట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలంటూ ధర్నా



రమణయ్యపేట వద్ద రహదారిపై ధర్నా చేస్తున్న యువకులు

ఏలేశ్వరం: ఏజెన్సీ ముఖద్వారమైన ప్రధాన రహదారిని పునర్నిర్మించాలని కోరుతూ రమణయ్యపేటలో శనివారం యువకులు ధర్నా చేశారు. ఏలేశ్వరం నుంచి ఏజెన్సీ వెళ్లేకి ఈ రహదారి మీదుగా అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి, గంగవరం, రంపచోడవరం మండలాలతో పాటు నర్సీపట్నం మీదుగా విశాఖపట్నం వరకూ రాకపోకలు సాగుతాయి. ఈ రహదారిపై పెద్దగుంతలు ఏర్పడడంతో వర్షపు నీరు గోతుల్లోకి చేరి రాకపోకలు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే వాహనదాదులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో జె.అన్నవరంతో పాటు పలు గ్రామాలకు చెందిన యువకులు ప్రధాన రహదారిపై ధర్నా చేసి నిరసన తెలిపారు. సంబంధిత అధికారులు వచ్చే వరకు ధర్నా ఆపేది లేదని భీష్మించారు. దీంతో రహదారి పొడువున ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో ఎట్టకేలకు ధర్నా విరమించారు. కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలిగా రాణి



సమావేశంలో మాట్లాడుతున్న దువ్వా శేషుబాబ్జీ

తుని: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలిగా నెమలి రాణి ఎన్నికయ్యారు. స్థానిక బ్యాంకు కాలనీ బాలభవన్‌లో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల మహాసభ జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్రావతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వై.ధనలక్ష్మి, ట్రెజరర్‌గా అంకంరెడ్డి రమణమ్మ, ఉపాధ్యక్షులుగా ఉమామహేశ్వరి, శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. అంగన్‌వాడీలు, హెల్పర్లు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేరీ సమాధానం, నెక్కెళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యర్థం.. అనర్థం

- రోడ్ల చెంతనే పేరుకుపోయిన వ్యర్థాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



దిబ్బలపాలెంలో రహదారిపై పేరుకుపోయిన చెత్త

ఏలేశ్వరం: పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. వీధులు, కాలనీల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. పట్టణంలోని రహదారులపై చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోయింది. దీంతో పాటు రహదారులను ఆనుకుని మొక్కలు పెరిగిపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని దిబ్బపాలెం, తోటవీధి, సువ్వయ్యమ్మపేట, సాయినగర్, తదితర ప్రాంతాల్లో రహదారులపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం పట్టణంలో వైరల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్ వ్యాధులతో అవస్థలు పడుతున్న ప్రజలకు పందులు, కుక్కల సంచారం సమస్యగా మారింది. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

నచ్చితేనే చెత్త తరలింపు

పారిశుధ్య సిబ్బంది తమకు నచ్చితేనే చెత్తను తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిబ్బంది రహదారిపై తాము పోగుచేసిన చెత్తను తప్ప ఇళ్లల్లోని చెత్తను వాహనంపై వేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇళ్లు, దుకాణాలు, హోటళ్లను శుభ్రం చేసుకోగా వచ్చిన వ్యర్థాలను ఒక దగ్గర పోగుచేసి ఉంచితే దానిని పారిశుధ్య సిబ్బంది చెత్త తీసుకువెళ్లే వాహనంలో వేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రౌతులపూడి: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని ఎస్.అగ్రహారం, డీజే పురం సెంటర్లలో శనివారం సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేపట్టారు. పలు వాహనాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వాహనాల రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంత్రం జల్దాం శివారు చాకిరేవులపాలెంలో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.4200 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

ఆటవిడుపుగా.. వేణుగానం



వేణువుతో గీతాలాపన చేస్తున్న ప్రత్తిపాడు ఎంపీడీఓ కుమార్ బాబు

ప్రత్తిపాడు: నిత్యం పనిఒత్తిడిలో ఉండే ప్రత్తిపాడు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు వేణుగానంతో తన తోటి సిబ్బందిని అలరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫ్లూట్‌తో దేశభక్తి గీతాలు, ఘంటసాల గేయాలు, ఆధునిక సంగీతంతో మెలోడీలను వేణువుతో ఆలపించారు. యూట్యూబ్ తన గురువు అని, ఒత్తిడి నుంచి బయటపడేందుకు ఇలా సాధన చేస్తుంటానని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు.

ఉత్తమ సేవా పురస్కార గ్రహీతకు సత్కారం



తునిలో తహసీల్దార్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ అధికారులు

తుని రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కలెక్టర్ షణ్మోషన్ చేతులమీదగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న తుని తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్‌ను శనివారం రెవెన్యూ అధికారులు ఘనంగా సత్కరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, వీఆర్వోలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది ప్రసాద్‌ను శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని కోరారు.

సీహెచ్‌సీలో తనిఖీలు



గోకవరం సీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సరిత

గోకవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ పి.సరిత శనివారం తనిఖీ చేశారు. మండలంలో సీజనల్ జ్వరాలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ఉన్న ఇన్‌పేషెంట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ జ్వరాలపై ఫీల్డ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలకు జ్వరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కొత్తపల్లి వైద్యురాలు డాక్టర్ నిఖిత గ్రామంలో నిర్వహిస్తున్న గృహ సందర్శనను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, ఏఎస్ఎం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముకుందా.. మురారి

- వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- వేషధారణలతో అలరించిన చిన్నారులు



కత్తిపూడిలో ఉట్టి కొడుతున్న యువత



ప్రత్తిపాడు మండలం ఏలూరులో ఉట్టి కొట్టే ఉత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

ఏలేశ్వరం: కృష్ణాష్టమి వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శనివారం వైభవంగా జరిగాయి. గ్రామాల్లోని వేణుగోపాలస్వామి, శ్రీకృష్ణుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల వద్ద ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక వాగువారి వీధిలో ఆలయధర్మకర్త వాగు సూరిబాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తుని రూరల్: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు, వేద విద్యార్థులు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే యనమల దివ్య, ఐఆర్ఎస్ అధికారి గోపీనాథ్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఎస్.అన్నవరం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ధర్మకర్తల ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి, మాజీ చైర్మన్ కుసుమంచి శోభారాణి, భక్తులు పాల్గొన్నారు.

రౌతులపూడి: కృష్ణాష్టమిని పురస్కరించుకుని శనివారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మండలంలోని రౌతులపూడి, శృంగవరం, పారుపాక, ఎస్.అగ్రహారం, ఎన్ఓ నగరం, ఎ.మల్లవరం, ములగపూడి, రాజవరం గ్రామాల్లోని శ్రీకృష్ణుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. రౌతులపూడి, ములగపూడి, పారుపాక తదితర గ్రామాల్లో స్వామివారి ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కిర్లంపూడి: మండలంలోని రామాలయాలు, కృష్ణాలయాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో ఏకాహం నిర్వహించారు. స్థానిక పరిసర గ్రామాల భజన బృందాలు పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. వేలంక, సింహాద్రిపురం, జగపతినగరం, కొండయ్యపేట, ముక్కొల్లు గ్రామాల్లో ఉట్టి కొట్టు ఉత్సవాలు నిర్వహించారు. ఉట్టి కొట్టేందుకు యువకులు, మహిళలు, పిల్లలు పోటీపడ్డారు. కృష్ణుడు, సత్యభామ, గోపికల వేషాధారణల్లో చిన్నారులు అలరించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రత్తిపాడు: మండల వ్యాప్తంగా శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయం, ఏలూరు శ్రీకృష్ణుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికలు వేషధారణల్లో అలరించారు. ఏలూరు శ్రీకృష్ణుని గుడి వద్ద ఉట్టికొట్టే ఉత్సవం నిర్వహించారు. ఉట్టిని కొట్టేందుకు యువకులు పోటీ పడ్డారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ దాడిశెట్టి రాణిచక్రధర్, కొట్టేటి అబ్బులు, దాడిశెట్టి అనంతబాబ్జి, సత్యారావు, సూర్యారావు, గోపి చిన్నయ్య, శేషు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

శంఖవరం: మండలవ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో వేణుగోపాల స్వామి, కృష్ణుని ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో భక్తులు భజనలు చేశారు. కత్తిపూడి, శంఖవరం, నెల్లిపూడి, మండపం, జి.కొత్తపల్లి, అచ్చంపేట తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

ప్రత్తిపాడు రూరల్: కృష్ణాష్టమిని పురస్కరించుకుని రాచపల్లి అరుణాచల క్షేత్రంలోని వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ధర్మవరం జగనన్న కాలనీ వద్ద యాదవ యూత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. దారిపొడువునా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. రౌతుపాలెంలో ఉట్టికొట్టే ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని వాకపల్లి, శరభవరం, చింతలూరు, గజ్జనపూడి, ఉత్తరకంచి, పెద్దిపాలెం, రాచపల్లి, రౌతుపాలెం, ఒమ్మంగి తదితర గ్రామాల్లోని శ్రీకృష్ణుడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గోకవరం: మండలంలోని గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోకవరంలో అటవీశాఖ కార్యాలయం వద్ద శ్రీకృష్ణుని ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. రాత్రి ఆలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. వెలమపేటలోని గీతా మందిరంలో సూర్యపీఠం అధ్యక్షుడు తోట సాయిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు వేషధారణల పోటీలు నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డి, పెంటపల్లి, కామరాజుపేట, తంటికొండ, మల్లవరం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

తొండంగి: మండలంలోని కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. తొండంగి, సీతారాంపురం, బెండపూడి, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం, వేమవరం, పెరుమాళ్లపురం, వాకదారిపేట, ఏవీ నగరం తదితర గ్రామాల్లోని కృష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టు ఉత్సవం ఘనంగా జరిగింది. బెండపూడి పంచాయతీ తమ్మయ్యపేటలో జాతీయ రహదారిపై బైక్ ర్యాలీ నిర్వహించారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.

గండేపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గండేపల్లి, నీలాద్రిరావుపేట, మల్లేపల్లి, తాళ్లూరు, మురారి, తదితర గ్రామాల్లోని శ్రీకృష్ణుడు, వేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



తపోవనం ఆశ్రమంలో ఉట్టి కొడుతున్న చిన్నారులు



గోకవరం కృష్ణుని ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



ఏలేశ్వరంలో శ్రీకృష్ణుని ఆలయం వద్ద భక్తి గీతాలు ఆలపిస్తున్న మహిళలు



కొండయ్యపేటలో ఉట్టి కొడుతున్న మహిళలు, చిన్నారులు